విశాలాంధ్ర శ్రీకాకుళం

పేజి నెం. 9

ఆదివారం 23, మార్చి, 2025

కుప్పిలి పరీక్షల వ్యవహారంలో ఆరుగురుపై కేసు నమోదు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన కుప్పిలి మోడల్ స్కూల్లో జరిగిన పదో తరగతి పరీక్షల వ్యవహారంలో ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష జరుగుతుండగా డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఆకస్మిక తనిఖీ నిర్వహించి 15 మందిపై సస్పెన్షన్ వేటు విధించారు. ఈ సంఘటనపై డీఈవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయులు ఎం. కనకరాజు (ఎస్ఏ ఇంగ్లీష్, బుడగట్లపాలెం), ఎస్.కృష్ణ (ఎస్ఏ హిందీ, కొయ్యాం), పి. నాగేశ్వరరావు (ఎస్ఏ మేథ్స్, కుప్పిలి), కె. కామేశ్వరరావు (ఎస్ఏ, హిందీ, కుప్పిలి), జె.పద్మకుమారి (హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్. కుప్పిలి), బి. కృష్ణ కిశోర్ (బోధనేతర సిబ్బంది, కుప్పిలి)లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిపై ఛీటింగ్, మాల్‌ప్రాక్టీస్ 318/4, 61/2, 3/5, 97,98 తదితర సెక్షన్లను నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తులో మరికొన్ని పేర్లు చేరే అవకాశం ఉందన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం

విశాలాంధ్ర -టెక్కలి/ కోటబొమ్మాళి: ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. శనివారం కోటబొమ్మాళి మండలం లోని ఎన్టీఆర్ భవన్ లో ప్రజా సమ స్యల పరిష్కార వేదిక పేరుతో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు చూచనలు జారీచేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. భూసమస్యలు పరిష్క రించాలని, టెక్కలి మండలం డమర, నర్సింగపల్లి గ్రామస్థలు మంత్రి కు వినత వత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా రాధకాంతం మఠం భూములు తమ ఆదీనంలో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ కూడా అయిందని, అయితే వన్‌బీ అడంగల్ రావడం లేదని వివరించారు. తక్షణమే భూ సమస్యలు పరిష్కరించాలని టెక్కలి ఆర్డీవోకు ఫోన్ ద్వారా ఆదేశించారు. కృష్టాపురం గ్రామానికి చెందిన పలువులు తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని తాగునీరు అందించాలని వినత పత్రం ఇచ్చారు. ఇప్పటికే అధికారులకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. టెక్కలి మండలం బన్నువాడ పంచాయితీకి నూతన సచివాలయం మంజూరు చేయాలని గ్రామానికి చెందిన సనపల మురళీధర్, వట్టికూళ్ల రామకృష్ణ, వట్టికూళ్ల డిల్లీశ్వరరావు, పోలాకి ఆనందరావు,కొండలరావు తదితరులు విన్నవించారు. బన్నువాడలో ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాంమని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, నాలుగు మండలాల అధికారులు, తెదేపా ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షయరహిత సమాజానికి కృషి

డీఎంహెచ్ఓ టి.వి. బాలకృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వి. బాలకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాలను గురించి శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అని, ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని ఆయన తెలిపారు. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, ముఖ్యంగా ఊపిరితిత్తులకు ప్రమాదం చూపుతుందని ఆయన వివరించారు. జిల్లాలో గతేడాది 3,854 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 3,428 కేసులు నమోదైనట్లు తెలిపారు. సకాలంలో క్షయకు చికిత్స పొందాలని, లేదంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుందని డాక్టర్ బాలకృష్ణ హెచ్చరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో సంప్రదించాలని ఆయన సూచించారు. సకాలంలో చికిత్స చేసుకుంటే దీనిని పూర్తిగా నివారించవచ్చునని, క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు డి ఎం హెచ్ ఓ కార్యాలయం నుండి 7 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి టి.బి. ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేసి, క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించిన దాతలను సత్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి శ్రీకాంత్, డిఐఓ డాక్టర్ రాందాస్, డిపిఎమ్ఓ వాన సురేష్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇదేమి పరీక్షల నిర్వహణ ?

- ప్రహసనంగా మారుతున్న పదో తరగతి పరీక్షలు
- స్లిప్పు టెస్ట్ ల కంటే అధ్వాన్నంగా...
- రాష్ట్రంలోనే సంచలనం కుప్పిలి వ్యవహారం...

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పదో తరగతి పరీక్షల నిర్వహణ ప్రహసనంగా మారింది. స్లిప్పు టెస్ట్ ల కంటే అధ్వాన్నంగా పరీక్షలు జరుగుతున్నాయి. పబ్లిక్ గానే చూచిరాతలు రాయిస్తున్నారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ పాఠశాల కేంద్రంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షల వ్యవహారం రాష్ట్రంలోనే సంచల నం సృష్టించింది. శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్ష నిర్వహణలో అవకత వకలపై ఏకంగా 14 మంది ఉపాధ్యాయులు సస్పెన్షన్, ఐదుగురు విద్యార్థుల డిబార్ ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాల్లో కలకలం రేపింది. ఈ పాఠశాలలోని ఏ, బీ కేంద్రాల్లో మొత్తం 425 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ కేంద్రంపై మొదటి నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది మాత్రమే ఈ కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగిందనుకుంటే తప్పులో కాలేసినట్టే. పరీక్షల ప్రారంభానికి ముందే హెల్పింగ్ ఫీజుగా కొంత మొత్తాన్ని వసూలు చేయడం ఈ కేంద్రంలో ఎప్పటి నుంచో ఉంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని కొనసాగించారు. పరీక్ష నిర్వహణకు హాజరయ్యే సిబ్బందికి టిఫిన్, మంచి భోజన సదుపాయం కల్పిస్తుంటారు. ఇక శుక్రవారం జరిగిన సంఘటన విషయానికొస్తే ఈ కేంద్రం నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు, చూచిరాతలపై రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న విద్యాశాఖ డీఈవో ఎస్. తిరుమల చైతన్య పర్యవేక్షణలో నాలుగు బృందాలు ఒకేసారి ఈ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఏ, బీ కేంద్రాల్లోని మొత్తం గదులన్నింటినీ పరిశీలించి బయట నుంచి వచ్చిన స్లిప్పులతో సిబ్బంది సమక్షంలోనే విద్యార్థులు రాయడాన్ని గుర్తించారు. అంతేకాకుండా ఇన్విజిలేటర్లు, సిబ్బంది చూచిరాతలకు విద్యార్థులకు సహకరిస్తున్నారన్న విషయం తేటతెల్లమైంది. పదోతరగతి మార్కుల ఆధారంగా ట్రిపుల్ సీట్లు కేటాయిస్తుండడంతోనే ఇలా బరితెగించారన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఇదే పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు రావడానికి ఇదే కారణమని చెప్పకనే చెప్పొచ్చు అని పలువురి అభిప్రాయం.

ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి...

జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు

బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: తిరుపతి నగరంలో మే 15 నుంచి 18 వరకు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్లో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగోను శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో మే 15 నుంచి 18 వరకు ఏఐవైఎఫ్ 17వ జాతియ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని మొదటి రోజు దేశ నలుమూలల నుండి వచ్చే వేలాదిమంది ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ బహిరంగ సభ నిర్వహించి అనంతరం అన్ని రాష్ట్రాల నుండి 1000 మంది ప్రతినిధులు ప్రతినిధుల మహాసభలో పాల్గొంటారని అన్నారు. ఈ మహాసభలో భారతదేశంలో విపరీతంగా పెరుగుతున్న నిరుద్యోగ సమస్య పైన, మతం పేరుతో జరుగుతున్న దాడులు పైన, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ దేశంలోని యువతను శాశ్వత నిరుద్యోగులుగా మారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల పైన సుదీర్ఘంగా మూడు రోజులపాటు చర్చించి భవిష్యత్తులో భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్ తీసుకువచ్చి దేశంలోని నిరుద్యోగ సమస్య ల పరిష్కారానికి 17వ జాతీయ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో యువతి,యువకులు , నిరుద్యోగ యువత పాల్గొవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చెల్లూరి రవి, ఏఐవైఎఫ్ నాయకులు వసంతరావు, హరి, బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా మండల అభివృద్ధి...

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎం.పి.డి.ఓ, బొడ్డేపల్లి మధుసూధనరావు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు పార్టీ గెలుపు కోసం ప్రయత్నించిన మనందరం, నేడు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా జమ్ము పంచాయితీ సర్పంచ్, వాన వేంకట గోవిందరాజులు మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో రావాడపేట, గడ్డయ్యపేట గ్రామాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజానీకానికి మంజూరు చేసిన ఎన్.టి.ఆర్ నగర్‌లో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే దేవాది పంచాయితీ సర్పంచ్ ప్రతినిధి, రాము మాట్లాడుతూ నరసన్నపేట మేజర్ పంచాయితీ ప్రజానీకానికి మంచినీరు అందించే బోరుబావుల విద్యుత్ బిల్లులు సుమారు రూ.8లక్షలు దేవాది పంచాయితీ చెల్లించాలని విద్యుత్ అధికారులు తెలిపార న్నారు. ఈ విషయమై దృష్టి సారించి రూ.8లక్షలు విద్యుత్ బిల్లు నరసన్నపేట మేజర్ పంచాయితీ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ, వైస్ ఎంపిపి ప్రతినిధులు, పాగోటి రాజారావు, చింతల వేంకటరమణ, తహాశీల్దార్, టి.సత్యన్నారాయణ, పోతయ్యవలస, గొట్టిపల్లి పంచాయితీ సర్పంచ్‌లు, కనపల శేఖర్‌రావు, అవ్వ రవికుమార్, ఎంపిటిసిలు, నేతింటి రాజేశ్వరరావు, వైశ్యరాజు కేశవరాజు, రమణ సాహు, పొట్నూరు సాయిప్రసాద్, బోయిన బాలకృష్ణ, ముచ్చ గణేష్ మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం పై మంత్రి అచ్చెన్న సుడిగాలి పర్యటన...



- పలు అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షణ.
- సీతాపురం పాఠశాల మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతాం
- సిరిమాను ఉత్సవాలలో పాల్గొన్న మంత్రి

విశాలాంధ్ర-టెక్కలి: అభివృద్ధికి ప్రణాళిక తయారు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో జరుగుతున్న సిసి రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి బోర్డును పెద్ద అక్షరాలతో పెట్టాలని, ఆసుపత్రి ముందు గేటు నుండి ఆసుపత్రి వరకు విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని, పలు సూచనలను అధికారులకు ఆదేశించారు. అనంతరం ద్విచక్ర వాహనంపై సీతాపురం గ్రామంలో ఉన్న సీతాపురం పాఠశాలను సందర్శించారు. సీతాపురం పాఠశాల మోడల్ పాఠశాల గా తీర్చిదిద్దుతామని, పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా తయారైన విద్యావ్యవస్థను చక్క దిద్దే దిశగా కూటమి ప్రభుత్వం బడులకు కొత్త రూపును తీసుకురానుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 570 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించడం అభినంద నీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు వేణు కుమారి మంత్రితో మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యను బోధించడానికి ఉపాధ్యాయ కొరత ఉందని తెలిపారు. వెంటనే మంత్రి విద్యాశాఖ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సీతాపురం పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగడానికి మంచినీరు కొరత ఉందని గ్రామానికి మంచినీరు కల్పించండని కోరారు. వెంటనే అధికారులతో మాట్లాడి ప్రతి ఇంటికి మంచినీరు చేరేలా చూడాలని, త్వరలోనే సీతాపురం గ్రామానికి త్రాగునీరు ట్యాంకును ఏర్పాటు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోలవరం గ్రామంలో జరుగుతున్న పాసిపోలమ్మ తల్లి గ్రామ దేవత సినిమానోత్సవ ఉత్సవాలలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ పర్యటనలో డివిజనల్ రెవెన్యూ అధికారి ఎం కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

- తాగునీటికి రూ.97 కోట్లతో నిధులు
- రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు



విశాలాంధ్ర-టెక్కలి/కోటబొమ్మాళి: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని రాష్ట్ర వ్యవసాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయడు అన్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో శనివారం గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో సమీక్ష సమామేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల పరిధిలో 497 గ్రామాలకు కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే రూ. 97 కోట్ల రూపాయల నిధులు లభ్యత ఉన్నందున త్వరిగ గతిన పనులు పూర్త చేయాలని సూచించారు. వాటి పనులు నిమిత్తం గుత్తేదారులను టెండర్లకు పిలవాలని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా నియోజకవర్గంలో ప్రధాన రక్షిత మంచినీటి పథకం ఎన్ని వాటర్ సరఫరా చేసే ట్యాంకులు ఉన్నాయని, వాటి పరిస్థిపై నివేదిక ఇవ్వాలని మంత్రి కోరగా 153 ట్యాంకులు ఉన్నాయని తెలిపారు. వారికి మరమ్మత్తులు చేయాల్సి ఉంటే తక్షణమే చేయాలని సూచించారు. వైకాపా ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పేరు పనులు చేపట్టారని ప్రస్తుతం వాటి పరిస్థితిని మంత్రి వివరణ కోరగా బాగున్నాయని వివరించారు. అదేవిధంగా గ్రామాల్లో అవసరమున్న చోట తాగునీరు బోర్లు వేయాలని సూచించారు. తాగునీరు సమస్యలు లేని గ్రామాలుగా ఉండాలనేదే తమ లక్ష్యమని అన్నారు. నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బాషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులకై తెలుగు తమ్ముళ్లు ఎదురుచూపులు

విశాలాంధ్ర-జలుమూరు: రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ఏర్పడి పది నెలలు పూర్తవుతున్న సందర్భంగా అనేక నామినేటెడ్ పదవులు కోసం గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటినుండో ఈ పదవులను నియమకం చేస్తామని ప్రకటి స్తున్నారని తప్ప చేపట్టడం లేదు. చాలా పదవుల కోసం ఎంతో ఆశతో తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొన్ని నామినేటెడ్ పదవులు ఇప్పటికే నియమించడం జరిగింది. గ్రామాల్లో సహకార సంఘాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ లు పలు పదవులకు చైర్మన్లు నియామకం ఉన్నది. ఈ రాతులు పూర్తయ్యే రోజులు దగ్గర ఉన్నాయని పార్టీ వర్గాలు తెలియజేస్తున్నాయి.

కొత్తూరులో పంటకోత ప్రయోగం...

విశాలాంధ్ర-కొత్తూరు: కొత్తూరు మండలం సోమరాజపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎం.టి. సూర్యనారాయణ అధ్వర్యంలో వాన రమణయ్య రైతు గుళి రాగి వంట లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ ఏడాది రబీ సాగులో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటం జరిగింది. ప్రకృతి వ్యవసాయానికి కెమికల్ వ్యవసాయానికి దిగుబడి ఎంత వచ్చింది తెలుసు కోవడానికి పంట కోత ప్రయోగం చేయటం జరిగింది. ఈ కార్య క్రమానికి ఎం.టీ సూర్యనారాయణ, యూనిట్ ఇన్చార్జి లు గోవిందరావు, చిన్నమ్మి, ఐసీఆర్‌పీ శ్రీనువాసరావు రైతులు పాల్గొన్నారు.

భావితరాలకు తాగునీటి పొదుపు అవసరం

విశాలాంధ్ర -పొందూరు: ప్రపంచ నీటి పొదుపు దినోత్సవం సందర్భంగా తాడివలస ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నీటిని ఒడిసి పట్టుకోవడం ద్వారా భావి తరాలకు త్రాగు నీటిని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోపాలశెట్టి సాయికుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి విద్యార్థులు మొక్కలు నాటడం, వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు, గ్రీన్ కోర్ క్లస్టర్ సమన్వయ కర్త పూజారి హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లుతో గ్రామాలు అభివృద్ధి

విశాలాంధ్ర- సోంపేట/ కంచిలి: కూటమి ప్రభుత్వంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం ద్వారా మంచి అభివృద్ధి జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేత మాదిన రామారావు పేర్కొన్నారు. కంచిలి మండలం ఎస్ఆర్‌సివురం కాలనీలో 2లక్షల 80వేల రూపాయలతో నిర్మిస్తున్న సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. మారుమూల గ్రామాల్లోను దీని ద్వారా మంచి మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కురయ్య, హరిబాబు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మా ఇంటికి వెళ్లే దారి మూసేశారు సారూ..

ఎంపీడీవోకు వినతి

విశాలాంధ్ర -పోలాకి: తర తరాలుగా తాతలు తండ్రుల నుండి శాశ్వతంగా నిర్మించు కొని నివసిస్తున్న మా ఇంటికి త్రోవలేక రహదారిని నలుమూలల ఆక్రమించి బంధించినట్లు పోలాకి పంచాయతీలో గల మునసబు పేట గ్రామానికి చెందిన అమలాపురం రామారావు దంపతులు వినతిలో పేర్కొన్నారు. ఇటీవల బతుకు తెరువు కోసము గత ఆరు నెలలుగా వలసల్లో పనిచేస్తూ మరల ఇంటికి వచ్చి నప్పటికీ మా ఇంటికి దారి లేకుండా దౌర్జన్యంతో ఆక్రమించి అడ్డు గోడలు కట్టి ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నట్లు ఆ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మా స్వగ్రామంలో మాసొంత స్థలంలో డోర్ నెంబర్ 8-145 నెంబర్ లో దాబా ఇంట్లో నివసిస్తున్నట్లు, ఇటీవల జీవనోపాధి కోసం హైదరాబాద్ లో కొంతకాలం ఉన్నట్లు తెలిపారు. ఇటీవల తిరిగి వచ్చినప్పటికీ డోల శ్రీరాములు శివ్వాల గోవిందరావు అనే వ్యక్తులు ఆ రహదారిని ఆక్రమించి పూర్తిగా రాకపోకలు నిలిపేసారని మేము వారిని అడగగా మాపై తిరుగుబాటు దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. తమరు తక్షణం పరిశీలించి మా ఇంటికి వెళ్లేందుకు దారి కల్పించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని వారి సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

కొర్లాం పంచాయతీలో డిజే సౌండింగ్ నిషేదం



విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం కొర్లాం గ్రామ పంచాయతీ లో వివిధ శుభకార్యాల్లో డీజే సౌండింగ్ ఏర్పాటును నిషేదిస్తూ గ్రామపంచాయతీ తీర్మానం చేసినట్లు సర్పంచ్ రాంబుడ్డి రమణమ్మ తెలిపారు. ఈ మేరకు పంచాయతీ తీర్మానాన్ని బారువ ఎస్సై హరిబాబుకు అందజేశారు. డీజే సౌండింగ్ వలన చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందికర సమస్యలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

నీటి కుంట ల నిర్మాణం చేయాలి : ఎమ్మెల్యే ఎంజిఆర్

విశాలాంధ్ర -వీరఘట్టం మండలం/ పాతపట్నం: రైతులకు ప్రతి సంవత్సరం ఆదాయం వచ్చేలా పంట సంజీవిని నీటి కుంటల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నమూనా రూపొందించింది వీటిలోని నీటితో రైతుల సేద్యం చేయడంతో పాటు కుంట చుట్టు కూరగాయలు పండ్ల మొక్కలు పెంచేలా రూపకల్పన చేసిందని శనివారం పాతపట్నం మండలంలో కాగువాడ గ్రామంలో నీటి కుంట నిర్మాణ పనులకు రైతులతో కలిసి నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావుభూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందా రావు మాట్లాడుతూ రైతులకు ఏటా ఆదాయం వచ్చేలా పంట సంజీవిని నీటి కుంటలు నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నమూనా (డిజైన్) రూపొందించింది అన్నారు. వీటిలోని నీటితో రైతుల సేద్యం చేయడంతో పాటు కుంట చుట్టు కూరగాయలు పండ్ల మొక్కలు పెంచేలా రూపకల్పన చేసిందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం ఒక్కో కుంట నిర్మాణానికి 50వేలకు పైగా ఖర్చు చేయనుంది.జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతుల ఆధ్వర్యంలో నీటి కుంటలను ఏటా ఏర్పాటు చేయిస్తున్నారు.నీటి కుంటలు రైతులకు ఉపయోగపడేలా కూటమి ప్రభుత్వం కొత్త నమూనాను రూపకల్పన చేసిందన్నారు. ప్రతి నీటి కుంటకు ఇన్లేవుట్ అవుట్లేవుట్ ఉండేలా ఏర్పాటు చేస్తూ కుంట చుట్టూ రెండు వరుసలో గట్ల నిర్మాణం చేసి ఒక వరుసలో కూరగాయల సాగు రెండో వరుసలో పండ్ల మొక్కలు పెంపకం చేసినట్లయితే ప్రతి ఏటా రైతుకు రూ.2వేలు ఆదాయం వస్తుందని తెలియజేశారు. అలాగే కుంటలో విధిగా నీరు నిల్వ చేయడం ద్వారా చుట్టూ భూగర్భ జలాలు పెరిగి పంటలు దిగుబడి అధికమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పి.డి బి. సుధాకర రావు, మండల అధికారులు,మండల నాయకులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు : మంత్రి అచ్చెన్న

టెక్కలి నియోజకవర్గానికి రూ.97 కోట్లు నిధులు :

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చటన్నయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాల్లో 497 గ్రామాలకు తాగునీరు అందించడానికి అవసరమైన రూ. 97 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తక్షణమే టెండర్లకు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటి సమస్య అనే మాట ఉండకూడదన్నరు. అవసరమున్న గ్రామాల్లో తాగునీటి బోర్లు వేయాలన్నరు. అలాగే నియోజక వర్గంలో ప్రధాన రక్షిత మంచినీటి పథకం, ఎన్ని వాటర్ సరఫరా చేసే ట్యాంకులు ఉన్నాయని, వాటి పరిస్థిపై నివేదిక ఇవ్వాలని మంత్రి కోరగా 153 ట్యాంకులు ఉన్నాయని అధికారులు తెలిపారు. వాటికి మరమ్మత్తులు చేయాల్సి ఉంటే తక్షణమే చేయించాలని సూచించారు. ప్రస్తుతం బాగానే ఉన్నాయని అధికారులు వివరించారు. గత వైకాపా ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పేరుతో పనులు చేపట్టారని, ప్రస్తుతం వాటి పరిస్థితి ఎలా ఉందని మంత్రి వివరణ కోరగా బాగున్నాయని వివరించారు. అదేవిధంగా గ్రామాల్లో అవసరమున్న చోట తాగునీటి బోర్లు వేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

ఫారంపాండ్ తో భూ గర్భజలాల అభివృద్ధి

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-గార: పల్లె పండుగ లో భాగంగా ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలని అభివృద్ధి చేసుకోవచ్చని, తద్వారా నీటి ఎద్దడి నివారణకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. గార మండలం అంపోలు పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఈ పథకం ద్వారా 30 వేల పనులు 4300 కోట్లతో జరిగాయని అప్పట్లా కాకుండా నిధులు పక్కదారి పట్టకుండా పక్కాగా పనులు చేయడం జరుగుతుంది నీ తెలిపారు. ప్రతి రైతుకు ఫారం పాండ్ కింద 60 వేల నుంచి పది లక్షల వరకు పనులు చేయవచ్చునని తెలిపారు. సీసీ రోడ్లు, గోశాలలు, చెరువుల అభివృద్ధి పనుల ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చునని తద్వారా రైతులకు పంటల కోసం నీటి వినియోగం కూడా చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం సహకారంతో ఉపాధి హామీ పథకం పనులు పూర్తిస్థాయిలో జరిపించడం జరుగుతుందని అందరూ ఈ పనులు ఉపయోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు ఉపాది హామీ కూలీలు పాల్గొన్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి



విశాలాంధ్ర -వజ్రపుకొత్తూరు: ఆదివారం నిర్వహించే ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమెరీసీ ఎసెస్మెంట్ పరీక్షలు అన్ని స్కూల్స్, మరియు అంగన్వాడి కేంద్రాల్లో సజావుగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎడిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు మండల సమాఖ్య కార్యాలయంలో వివోఏ లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎవో లు, ఇన్విజిలేటర్స్ చక్కగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఎన్ఐవోలెస్ పరీక్షలకు శతశాతం హాజరు అయ్యేటట్లు ప్లాన్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సిసీలు బిటోయేలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

శివరాంపురంలో త్రాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మేజర్ పంచాయతీలో గల శివరాంపురం గ్రామంలో రెండు వీధులకు శాశ్వత త్రాగునీటి సమస్య పరిష్కారం చేసినట్లు సంతబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కలింగపట్నం లక్ష్మీ అప్పారావు శనివారం తెలిపారు. గత కొద్ది రోజులు నుంచి పైపులైన్లు పాడైపోవడంతో త్రాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పైప్లైన్ నూతనంగా ఏర్పాటు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. ఆయనతో పాటు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, సంతబొమ్మాళి మేజర్ పంచాయితీ కార్యదర్శి దుంపల శ్రీనివాసరావు ఉన్నారు.

ఎర్త్ అవర్ పాటించాలి

విశాలాంధ్ర-పలాస: ప్రతి ఒక్కరూ ఎర్త్ అవర్ పాటించాలని పలాస మండలం బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వి రమణారావు అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో పాఠశాలలోని జాతీయ హరిత దళం క్లబ్ (ఎన్జీసి), జూనియర్ రెడ్ క్రాస్ క్లబ్ ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు బల్బ్ ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా రాత్రి 8:30 నుంచి 9:30 వరకూ తమ ఇంట్లో విద్యుత్తు ఉపకరణాలు గంట పాటు ఆపివేసి ఎర్త్ అవర్ పాటించాలన్నారు.విద్యుత్తు పొదుపు ద్వారా భూతాపాన్ని ఆపి, పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్జీసి కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించగా ఉపాధ్యాయ సిబ్బంది.. ఈశ్వరరావు, సుధాకుమారి, జనార్ధన రావు, పద్మ, శివప్రసాద్, యామిని, కిషోర్, రజని కుమారి, జ్యోతమ్మ, అరుణ కుమారి, క్రిష్ణవేణి, చిన్నారావు, లక్ష్మి భాయి, విష్ణుఆచారి, మధు సూదన్, రవితేజ, కోటేశ్వరరావు, తులసిరాణి పాల్గొన్నారు.

సత్యం ఫౌండేషన్ ఆదర్శం

- తెరవేకు పుస్తక వితరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఏలూరు జిల్లా భీమడోలులోని స్వచ్ఛంద సేవా సంస్థ సత్యం ఫౌండేషన్ స్థానిక తెలుగు రచయితల వేదిక(తెరవే)కు వెన్నెల వెలుగులు అనే టైటిల్ తో ఉన్న 61పుస్తకాలను ఉదారంగా పంపారు.ఈ విషయాన్ని తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు,ఆర్.వి.రమణమూర్తి లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సత్యం ఫౌండేషన్ వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ బాలనాగు సుబ్రహ్మణ్య ప్రసాద్ రాసిన ఈ విశిష్ట పుస్తకాలను అతని కుమారులు విజయసారథి, శ్రీధర్ విజయకృష్ణ బాధ్యత తీసుకుని పంపారు.సాహిత్య రంగంలో తెలుగు రచయితల వేదిక చేస్తున్న అమూల్యమైన కార్యక్రమాలకు స్పందించి భీమడోలు సత్యం ఫౌండేషన్ ఈ వితరణను చేపట్టడం విశేషం.డా.ప్రసాద్ చమత్కార చంద్రికలు అనే పుస్తకం కూడా తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం పొందిందని అతని కోడలు శైలజ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులకు తెరవే ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఉగాది నాడు ఈ పుస్తకాలను సభ్యులకు పంపిణీ చేస్తారు.

ముగిసిన శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ పి ఓ పార్వతి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పి ఓ పార్వతి మాట్లాడుతూ పుట్టిన నుంచి ఆరేళ్ల పిల్లల వయస్సు గల చిన్నారుల గురించి పిల్లల్లో పఠనశక్తిని, ప్రతి అంగన్వాడీ కార్యకర్త రోజు యాప్ ద్వారా వచ్చే అభ్యసన గురించి వివరించారు. ఈ శిక్షణలో రెండు మండలాలు నుంచి 145 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాశిబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పి ఓ కె.పార్వతి, ఎంఈఓ రమణమూర్తి, హెచ్.ఎం తండా , సూపర్ వైజర్ ఆర్.ధనలక్ష్మీ గంగమ్మ లత, సరస్వతి జమయ్య అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర-కవిటి: దళితుల హక్కులకు భంగం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీమోహన్ రావు బెహరా హెచ్చరించారు. ఈ మేరకు శనివారం మండలంలోని జగతి దళితవాడలో సివిల్ రైట్స్ డే సందర్భంగా మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం కల్పించిన భూములను ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.దళిత గ్రామాల్లో ఎనిమిది నుంచి పీజీ చదివే విద్యార్థులకు వసతి సదుపాయం అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.ఈ సందర్భంగా దళిత హక్కులపై అవగాహన కల్పించారు.స్థానిక సర్పంచ్ పూడి వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వి. రవివర్మ, వీఆర్వో వీరేంద్ర, గ్రామస్తులు తమరాల హరినాథ్, శమల్ల వ్యాదవ్యాస్, పూడి ప్రవీణ్, దళిత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సారవకోటలో పాడైన వీధి రోడ్లు

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రం సారవకోట ఏ వీధి చూసిన ఏమున్నది గర్వకారణం అన్న చందంగా కనిపిస్తున్నాయి. చరిత్ర కలిగిన సారవకోట ప్రతి వీధి గోతులమయంతో కనిపిస్తున్నాయి మండల కేంద్రంసారవకోట లోఈ దారుణ పరిస్థితి ఉండడంతో పలువురు పలు విమర్శలు చేస్తున్నారు. సొండి వీధి నాయుడు వీధి రెల్లి వీధి ఏ వీధి చూసినా రోడ్ల పరిస్థితి బాగో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు పాలకులు అధికారులు పరిశీలించి మండల కేంద్రంలో సారవకోట రోడ్లు బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ తమ నివేదికలను చదివి వినిపించారు. విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసరావు తన నివేదిక చదివి వినిపిస్తున్న సమయంలో బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్పి నారాయణస్వామి సూర్య ఘర్ పథకానికి అర్హత సాధించడానికి విద్యుత్ కనెక్షన్ పేరు మార్పిడి కి వినియోగదారులు ఏం చేయాలని ఏ ఏ పత్రాలు సమర్పించాలని ప్రశ్నించారు. ఈ విషయంపై ఏఈ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ విద్యుత్ మీటర్ వినియోగదారుడు పేరు మార్పిడికి, విద్యుత్ మీటర్ పేరున ఉన్న యజమాని మృతి చెందినట్లయితే సంబంధిత కుటుంబ యజమాని ఇంటి పన్ను రసీదు, ఆధార్ కార్డు , టెస్ట్ రిపోర్ట్ , ఇండివిజువల్ లెటర్తో సంబంధిత విద్యుత్ శాఖ కార్యాలయానికి సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అలాంటప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. హౌసింగ్ ఏఈ రఘు తన వేదిక చదివి వినిపించిన సమయంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ హౌసింగ్ దరఖాస్తులు స్వీకరించే సమయంలో ఆయా పంచాయతీల సర్పంచ్ కు గాని ఎంపీటీసీలకు గాని పూర్తిగా సమాచారం లేకుండా హౌసింగ్ దరఖాస్తులు స్వీకరించారని దీని వెనుక మర్మం ఏంటని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అధిక మొత్తంలో హౌసింగ్ కు దరఖాస్తులు అందాయని కానీ నిర్మాణ పనులు కొంతమంది పూర్తిగా నిర్మాణ పనులు చేపట్టలేదని ప్రస్తుతం గృహ నిర్మాణ పనులు పూర్తిచేయాలని దీనికి ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అధిక మొత్తంలో గృహాలు మంజూరు చేసినప్పటికీ ఇంకా దరఖాస్తులు రావడం ఏంటని ఉన్నతాధి కారులు మాకు ప్రశ్నించారని దానికి మేం సమాధానం చెప్పలేకపోతున్నామని వివరించారు. నిజమైన అర్హులకు సొంత ఇంటి కల సాకారం అయ్యేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ తన నివేదిక చదివి వినిపించిన సమయంలో సర్పంచ్ నారాయణస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో డయాలసిస్ రోగులకు 108 సహాయంతో డయాలసిస్ కేంద్రానికి తరలించే వారిని నేడు అలా జరగడం లేదని 108 సేవలు కిడ్నీ రోగులకు ఎందుకు నిలుపుదల చేశారని ప్రశ్నించారు. ఈ విషయంపై తన వద్ద సమాధానం లేదని ఉన్నతాధికారులను అడిగి సమాధానాన్ని తెలుసుకుంటానని వివరించారు. రెవెన్యూ శాఖ నివేదిక సందర్భంగా తాసిల్దార్ మురళీమోహన్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఏపీ ఎస్సీపిసిఆర్ సభ్యుడు సీతారాం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఈ నెల 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు సమకూర్చిన సదుపాయాలను పరిశీలించేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీ ఎస్సీపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం శనివారం జిల్లాలోని ఎచ్చెర్ల ప్రభుత్వ హైస్కూల్ ను పరీక్ష ప్రారంభానికి మునుపు సందర్శించారు. ప్రతీ తరగతిని గమనించారు. వెలుతురు, ఫ్యాన్లు సరిపడినన్ని ఉన్నవీ, లేనిది, విద్యుత్ సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయా, మరుగు దొడ్ల శుభ్రతగురించి అడిగి తెలుసుకున్నారు. మంచి నీటి సదుపాయం సంతృప్తికరంగా ఉందా, ఇబ్బందులేవైనా ఉన్నాయా,వడదెబ్బ ఎదురైతే ఎటువంటి ముందస్తు చికిత్స ప్రక్రియలు చేపడతారో జిల్లా విద్యాశాఖాధికారులు,స్కూల్ యాజమాన్యం నుండి అడిగి తెలుసుకున్నారు,ప్రాథమిక చికిత్సలో ఎటువంటి మందులు వినియోగిస్తున్నారో పారా మెడికల్ సిబ్బంది నుండి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారధ్యంలో పరీక్ష కేంద్రాల్లో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ముందస్తుగానే అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి జాగృత పరిచినట్లు తెలిపారు. బాలల హక్కులకు ఎక్కడ విఘాతం కలిగినా ఉపేక్షించబోమని అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా పరీక్ష చివరి రోజు వరకు తమ కమిషన్ చైర్ పర్సన్ సారధ్యాన అన్ని జిల్లాల్లో పర్యటనలు జరుపుతూనే ఉంటామని సీతారాం చెప్పారు. ఈ పర్యటనలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎచ్చెర్ల మండల విద్యాశాఖాధికారులు కె.పున్నయ్య, జి.రాజ్ కిశోర్,సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఏ.సంజీవ రావు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బి. జయదేవి, సిట్టింగ్ స్వాడ్ కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: అన్ని విధాలుగా పాతపట్నం నియోజకవర్గం ను అభివృద్ధి చేయడమే ధ్యేయమని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నారు. కూటమి పాలన ఏర్పడి 9 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల పాలనలో పాతపట్నం నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, విద్యాలయాలు, వసతి గృహాల నిర్మాణం, మంచినీటి సరఫరాకు సుమారు 400 కోట్ల రూపాయలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించుకున్నామని తెలిపారు గత పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్లనే నియోజకవర్గం వెనుకబాటుతనానికి గురైందని ,డోలిమోతలు లేని గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్ది ప్రతి గ్రామానికి వాహనాలు వెళ్లే విధంగా రహదారులను నిర్మించి ప్రతీ ఒక్కరికీ విద్య,వైద్యం,మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని అన్నారు,గిరిపుత్రుల అభివృద్ధి,ఉపాధి అవకాశాలు,జీవనోపాధి కల్పించడానికి ఒక్క ఐటీడీఏ ఏర్పాటు తోనే సాధ్యమని అందుకు ఐటిడిఏ సాధించే వరకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు అదేవిధంగా నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఉద్దానం ఫేజ్ "టు" ద్వారా సుమారు 260 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని దీంతో నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు త్రాగునీటి సమస్య తీరనుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెలియాపుట్టి మాజీ ఎంపీపీ సలాన మోహనరావు,పాతపట్నం మండల పార్టీ అధ్యక్షులు పైల బాబ్జి,ఎల్ఎన్ పేట మండల పార్టీ అధ్యక్షులు మెండ మనోహర్,ఒమ్మి ఆనందరావు,కొవిలాపు కృష్ణమాచార్య,సైలాడ సతీష్, నంబాల వెంకటరావు, కదంబల పైడిరాజు, అరుబోలు దశరదరావు, కొమరాపు చిరంజీవి, సీమ రామకృష్ణ, అక్కంద్ర సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యమత్యంగా అభివృద్ధి చేసుకుందాం: ఎమ్మెల్యే గౌతు శిరీషా

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: ఐక్యమత్యంగా ఉండి పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. శనివారం మండలం టిడిపి కార్యాయలం వద్ద మండల టిడిపి అధ్యక్షులు సూరాడ మోహనరావు అధ్యక్షతన ప్రజాదర్బార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ గౌతు శిరీష ప్రజలు, కార్యకర్తల నుండి వినతులు స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి హయాంలో మంత్రిగా డా.అప్పలరాజు ఉన్నప్పటికీ పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ప్రచార ఆర్భాటం నిర్వహించారని అన్నారు. పలాస కిడ్ని ఆసుపత్రి లో పనిచేస్తున్న సిబ్బందికి ఏడాదిగా వైసిపి ప్రభుత్వం జీతాలు చెల్లించలేక పోయారని ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి వారికి జీతాలు చెల్లించేందుకు కృషి చేశానని తెలిపారు. అలాగే జీడి మద్దతు ధరపై అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించానని, వచ్చేనెల కేంద్ర మంత్రికి జీడిమద్దతు ధరపై కలుస్తున్నట్లు చెప్పారు. అధికారంలో వచ్చిన రోజులలోనే వజ్రపుకొత్తూరు మండలంలో గల శివారు భూములకు సాగునీరందించామన్నారు. రూ.70 కోట్లు తో నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించుకున్నామన్నారు . అలాగే తారురోడ్లు నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు మేరకు ప్రతి బుధవారం నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని అందులో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవచ్చని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. గ్రామాలలో సమస్యలు గ్రామ కమిటీ అధ్యక్షుడు పరిష్కారం చేపట్టాలని అవసరమైతే మండల, నియోవర్గనాయకులను సంప్రదించాలని కోరారు కుటుంబ సాధికారిక సభ్యులుగా ప్రతి ఒక్కరు చేరాలని వారికే పదవులలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త నా ఊరు నా బాధ్యగా బావించి గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ గొరకల వసంత స్వామి, మండల ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు. కర్ని రమణ, మాజీ కో ఆప్షన్ నెయ్యిల సూర్య అరాయణ, గోవింద పాపారావు, పి సాంబమూర్తి,రామకృష్ణ, శశిభూషణ్, కనితి సురేష్, జె జె రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక శ్రీ జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాలో సుమారు 200మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు. ఈ మేళాలో సుమారు 87మందికి పలు మల్టీనేషనల్ కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఫాక్సన్ కంపెనీ(మహిళలు) 23మందికి, బ్లూస్టార్ కంపెనీ(పురుషులు) 17మందికి, ఎన్.ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీ(పురుషులు) 05మందికి, కాల్గెట్ కంపెనీకి 03మంది, డైకాన్ కంపెనీకి 19మంది యువతీ, యువకులకు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారందరూ హైదరాబాద్ శ్రీ సిటీ నందు ఎం.ఎన్.సిలో ఉద్యోగం చేయుటకు సంబంధిత కంపెనీ యాజమాన్యం నుండి అంగీకార పత్రాలను శ్రీ జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ప్రతినిధులు, వరుదు ప్రవీణ యువతీ, యువకులకు అందచేశారు. ఈ సంధర్భంగా ఇంటలీరేస్ కంపెనీ సి.ఈ.ఓ, రొక్కం నరేంద్రకు కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, చింతు కృష్ణారావు, యాజమాన్య ప్రతినిధి, రుక్మంగాధరరావు, అధ్యాపక సిబ్బందితో పాటు పలు కంపెనీ ప్రతినిధులు, బాలకుమార్, మురళీ, శంకర్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు

తీరప్రాంత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించండి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: ప్రస్తుత వేసవి సీజన్లో సంతబొమ్మాళి మండలంలో గల మరువాడ, మేఘవరం, లక్కివలస పంచాయతీలలో ఉన్న తీరప్రాంత గ్రామాలకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, మత్యకార సంఘం నాయకుడు సూరాడ ధనరాజు ఎంపీడీవోను కోరారు. తీరప్రాంత గ్రామాల్లో వేసవిలో బోర్లు బావులు లో ఉన్న నీరు అడుగంటి పోతుందని దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. బోర్లు, బావులు మరమ్మత్తులు చేయించి త్రాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయనతోపాటు మత్యకార నాయకుడు సురాడ చిన్నదాన రాజు ఉన్నారు.

నీటిని కాపాడే పద్ధతులపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-టెక్కలి: స్వచ్ఛమైన నీటి కొరత అనేది నేటి ప్రపంచ సమస్యగా మారిందని అమ్మ ఒడి డైరెక్టర్ ప్రిన్సిపల్ బి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జల వనరుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలో స్థానిక పాఠశాల నుండి అంబేద్కర్ జంక్షన్, నగర వీధులలో విద్యార్థులతో కలిసి నీరు ఎలా కాపాడుకోవాలో దానిపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటి కొరత అనేది నేటి ప్రపంచ సమస్యగా మారిందని, దీనిని అధిగమించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. ప్రకృతిలో నీటిని కాపాడ కోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని ఆయన తెలిపారు. నీరు ప్రాణానికి అవసరం, నీటిని కాపాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని బృందం హెడ్మాస్టర్ దామోదరరావు, ఇంచార్జ్ పుష్పలత, రవికుమార్, బాలాజీ, కృష్ణారావు, రాజు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ప్రతీఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: వాతావరణంలో కాలుష్యం నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి, కె.సునీత అన్నారు. శనివారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ వాతావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ.ఓ, సునీత మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు పొందేందుకు మొక్కలను పెంచి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. వాతావరణంపై సామాన్య మానువునికి అవగాహన కల్పించేందుకు విరివిగా విధ్యార్థులు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వాతావరణం మానవాళికి అనుకూలంగా మలిచేందుకు ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు, పౌరులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇంఛార్జ్, ఎం.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఓ, కె.రాము, కంప్యూటర్ అధ్యాపకురాలు, అశ్విని, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి, జి.ఉమామహేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-మందస: పలాస నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం మందస మండలం హరిపురం నరేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజా దర్బారు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష. ప్రజల నుండి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజవర్గంలో గల మండల, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయా ప్రాంతాలలో ప్రజల సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.ప్రతి సమస్య ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.ప్రతీ ఒక్క అధికారి గ్రామ పరిధిలో సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టడంతో ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిరీష కోరారు.

ప్రజల్లో మానసిక పరిపక్వతను తీసుకువచ్చేది...కవిత్వం

విశాలాంధ్ర-నరసన్నపేట: ప్రజల్లో మానసిక పరిపక్వత తీసుకువచ్చేది కవిత్వమే అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు, డా.జి.రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కవిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్. డా.పి.లత ఆధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా.రవికుమార్ మాట్లాడుతూ ప్రేమ, అనురాగం, ఆప్యాయత, జీవితం, పుట్టుక, మరణం మొదలైన మానసిక అంశాలను వ్యక్తీకరించటంలో కవిత్వం తిరుగులేదన్నారు.

జలవనరుల ప్రాధాన్యతపై ర్యాలీ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా దత్తత గ్రామమైన గొట్టిపల్లిలో ప్రజానీకానికి నీరు వాడుకపై అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు, నాగరాజు, ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యం జల వనరులపై ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యు.బి.ఏ కోఆర్డినేటర్, పి.ఢిల్లేశ్వరరరావు, కళాశాల అధ్యాపకులు, శాంతిహేమ్, డా.పి.అన్నాజీరావు, శ్రీవిద్య, పరమేశ్వరరావు, పల్లవి, పవిత్ర, వేంకటేశ్వరరావు, రెయ్యమ్మ, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా తేజేశ్వరరావు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేటకు చెందిన హైకోర్టు ప్రముఖ న్యాయవాది తోట తేజేశ్వరరావు తాజాగా జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీ వంగా స్థానం సంపాదిం చుకున్నారు. బార్ అసోసియేషన్లో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఆయన ఎన్నికయ్యారు. దీని పట్ల సోంపేటలో పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు. సుమారు 15ఏళ్లుగా హైకోర్టు న్యాయవాదిగా అటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోను ఇటు విభజిత ఆంధ్రప్రదేశ్లోను హైకోర్టు న్యాయవాదిగా సేవలందిస్తున్నారు.

వ్యవసాయ కార్యాలయంకు మున్సిపాలిటీ కి ఏం సంబంధం

- విశాలాంధ్ర కథనంపై ప్రశ్నించిన కోప్షన్ సభ్యుడు బమ్మిడి
- కాశీబుగ్గ వ్యవసాయ డిపో స్థలం మున్సిపాలిటీ దే...
- కమిషనర్ నడిపేన

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ కేటి రోడ్డు సమీపంలో గల వ్యవసాయ శాఖ కార్యాలయం కు మున్సిపాలిటీ అధికారులకు ఏమిటి సంబంధమని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ నడిపేన రామారావు సమాధానం చెబుతూ కాశీబుగ్గ వ్యవసాయ శాఖ కార్యాలయం మున్సిపాలిటీ పరిధిలోనిదేనని శిధిలావస్థకు చేరుకున్న కార్యాలయమును తొలగించి దానిని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని సమాధానం ఇచ్చారు. శుక్రవారం విశాలాంధ్ర దినపత్రికలో కాశిబుగ్గ వ్యవసాయ డిపో స్థలంపై కన్ను..? శీర్షికన వచ్చిన వార్తపై బమ్మిడి సంతోష్ ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి బాబు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం తో పాటు సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతులకు అందుబాటులోకి ఉండి వారి సమస్యలు తీర్చే కార్యాలయమును తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అదే విదంగా కోవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి పారిశుద్ధ్య పనులు చేసిన కొద్దిమంది పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు ఇప్పటికీ జీతాలు చెల్లించకపోవడం చాలా దారుణమని కౌన్సిలర్ జోగారావు ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఆరు నెలలుగా కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నిస్తున్న విలువ లేకుండా పోయిందన్నారు. అడిగిన ప్రశ్నలకు, సమస్యలు పరిష్కరించకపోతే తాము ఎందుకు కౌన్సిల్ సమావేశంలో రావాలని ప్రశ్నించారు. జీతాలు పేరుతో లక్షలాది రూపాయలు బడ్జెట్లో అంచనాలు వేసి, పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అందుకు స్పందించిన మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, కోవిడ్ కాలం లో పని చేసిన పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. 2025-26 బడ్జెట్ అంచనాల్లో ప్రతి విభాగంలోనూ వాస్తవితకు దూరంగా అధికంగా అంచనాలు వేయడం పట్ల కౌన్సిలర్లు తప్పుపట్టారు. కౌన్సిలర్ అడిగిన ప్రతి ప్రశ్నకు తరువాత సమాధానం చెబుతానని కమిషనర్ రామారావు దాటవేయడం పట్ల కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో జరిగిన ఒక ప్రయివేటు ఉత్సవం గా నిర్వహించే జామి ఎల్లమ్మ జాతరకు మున్సిపల్ నిధులు ఎందుకు వెచ్చించాలని, జాతర కమిటీ పేరుతో దౌర్జన్య కమిటీ వేసుకొని భక్తుల నుంచి రూ.లక్షలు వసూళ్లు చేశారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు దుర్గా శంకర్ పండా, పప్పల ప్రసాదరావు, గుజ్జు జోగారావు, విచ్చుక అజయ్ మాట్లాడుతూ

ఎల్లమ్మ జాతరకు గుర్తింపు లేని కమిటీ వేసుకొని భారీగా భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేసారని, అధికారికంగా 80 వేల మంది భక్తులు దర్శించుకోగా వారి వద్ద నుంచి ఎంత వసూళ్లయిందో భహిరంగ రహస్యమని అన్నారు. అటువంటపుడు మున్సిపాలిటి ఎందుకు యాత్రకు ఖర్చు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అజెండాలో 2, 3, 4 అంశాల్లో ఎల్లమ్మ జాతరకు రూ.3 లక్షల వరకూ ఖర్చు చేసినట్లు చెబుతున్నారని, అంత ఖర్చు ఎందుకు పెట్టారు, ఎక్కడ ఖర్చు చేసారో సమాధానం ఇవ్వాలని పట్టుబట్టారు. వైసీపీ సభ్యులంతా దీన్ని వ్యతిరేకిస్తున్నామని చైర్మన్ బళ్ల గిరిబాబుకు డీసెంట్ తెలియజేసారు. సభ్యులు మాట్లాడుతూ మున్సిపాలిటిలో జరిగిన కార్యక్రమానికి చైర్మన్ తో సహా పాలకవర్గంకు కనీస మర్యాద ఇవ్వలేదని, పాసులు ఇచ్చి గుడిచుట్టు తిప్పుతు అవమాన పరిచారని ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై కమిషనర్ ఎన్.రామారావు వివరణ ఇస్తు ఇది రాష్ట్రస్థాయి పండుగ మాదిరిగా జరుగుతుందని, భారీసంఖ్యలో భక్తులు వస్తారని పోలీసు ఇంటిలిజెన్స్ నివేదిక ఆధారంగా తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందన్నారు. భక్తులకు ప్రసాదాలతో పాటు నగర సుందరీకరణకు విద్యుత్ దీపాలతో అలంకరించామన్నారు. మున్సిపాలిటీలో తాగునీరు కోసం ఇష్టానుసారంగా ప్రణాళికలు వేయడం పట్ల కౌన్సిలర్ దుర్గా శంకర్ పండా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఏ వార్డులో తాగునీటి సమస్య ఉందో, ఒక్క కౌన్సిలర్ కైనా అడిగారా, అరకొరగా ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తే వార్డుల్లో ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఏలా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి మేరకు ఉద్దానం రక్షిత మంచినీటి పథకం పలాస-కాశీబుగ్గకు రావడం శుభపరిణామని కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా పాలకమండలి తరుపున ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్దానం నీటితో వేసవి నీటిఎద్దడి లేకుండా ఉంటుందని, ఆఫ్షోర్ జలాశయం పూర్తయ్యే వరకు పురప్రజల దాహార్తి తీరుతుందన్నారు. సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతు వేసవి నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని, వార్డుల్లో ఇచ్చే నీటి పాయింట్ల వివరాలు సభ్యులకు తెలియజేయాలని కోరారు. అంతకు ముందు మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించి ఆమోదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డిక్కల ఆనంద్, జ్యోతి నాయక్, శార్వాణి గీత, సనపల సింహాచలం, బెల్లాల శ్రీనివాసరావు, సవర సోమేశ్వరరావు, డిఇ కనకరాజు ఎఇ కిరణ్ కుమార్ డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి నారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖరీదైన స్థలం.. కబ్జాకు యత్నం...!

న్యాయపోరాటం చేస్తా వెంకటరమణ

విశాలాంధ్ర- ఆమదాల వలస: ఆమదాలవలస పట్టణం నడిబొడ్డిలోని ఖరీదైన స్థలంలోని పాత కట్టడాన్ని దౌర్జన్యంగా తొలగిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థల యజమాని పుల్లేటికుర్తి వెంకటరమణ పోలీసులను ఆశ్రయిం చి తవ్వకాలను నిలిపివేయించారు. ఖరీదైన స్థలా లపై కొన్ని కొంతమంది నకిలీ డాక్యుమెంటులను సృష్టించి స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయ త్నాలు చేస్తున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. జనవరి 19వ తేదీన తన స్థలం పైకి జెసిబి తో వచ్చి నన్ను బెదిరించి అక్కడ ఉన్న మిద్దెను కూలగొట్టారని జిల్లా పోలీసు అధికారుల చొరవతో సమస్య సద్దుమణిగిందని బాధితుడు తెలిపారు. తిరిగి శుక్రవారం జెసిబి ట్రాక్టర్ లతో అక్కడ ఉన్న మట్టిని తొలగిస్తున్న సందర్భంలో వెంకటరమణ అడ్డుకున్నారు. ఆముదాలవలస పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను సంబంధిత పత్రాలతో పోలీసుల సమక్షంలో వరి శీలన చేశారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పత్రా లను వెంకటరమణ

పొందుపరిచారు. ఏప్రిల్ 20 25 వరకు ఇరు వర్గాల వారు కెవిట్ నిబంధనలు ఉన్నాయి. మట్టి తరలింపును అడ్డుకున్న సంద ర్భంలో ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. పొడుగు సురేష్ కుమార్ తనకు 2024లో రిజిస్ట్రేషన్ చేశారని తెలుగుదేశానికి చెందిన ఒక వ్యక్తి వెంకటరమణను అడ్డుకున్నా రు.23 లో తన పేరున రిజిస్ట్రేషన్ చేసిన పత్రాల ను అందుకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్లను వెంకటరమణ పోలీస్ రెవెన్యూ అధికారుల వద్ద పొందుపరిచారు. సర్వేర్ గోపి తన సిబ్బందితో వచ్చి ఆ స్థలానికి కొలతలు వేశారు. ఈసీ ఎవరి పేరును వస్తున్నదో దాని ప్రకారం డాక్యుమెంట్ అందిస్తామని పోలీసులకు వివరించి వెళ్ళిపో యారు. ఇదిలా ఉండగా సర్వేనెంబర్ 135లో 40 పొడవు 20 వెడల్పు ఉన్న 88.8 8లో పుల్లెట్టి కుర్తి వెంకటరమణ పేరున రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్నా యి. పొడుగు సురేష్ కుమార్ కు ఎటువంటి వార సత్వ హక్కు లేనప్పటికీ బొడ్డుపల్లి పేటకు చెందిన దౌర్జన్యం చేస్తూ రాత్రి సమయాలలో జెసిబిలను దించి కూలగొడుతున్నాడని ఆరోపించారు. ఆ స్థలం నుండి తాను తప్పుకోకుంటే హతమారుస్తా నని బెదిరిస్తున్నారని వెంకటరమణ ఆరోపించారు. తనకున్న అన్ని వనరులను పెట్టుబడిగా పెట్టి ఆ స్థలాన్ని కొనుగోలు చేశానని దీనిపై న్యాయపోరా టం చేస్తానని వెల్లడించారు.

న్యాయస్థానం తీర్పుపై ఎమ్మెల్యే గౌతు శిరీష హర్షం

విశాలాంధ్ర-పలాస: వైసిపి ప్రభుత్వ హయాంలో తనపై తప్పుడు రాతలు రాసిన ఒక సాయంకాలం దినపత్రిక సంపాదకుడు జగదీశ్వరరావు పై 2023లో విశాఖ కోర్టులో ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విలేకరికి రూ. 2 లక్షల జరిమానాతో పాటు అదనపు కోర్టు ఖర్చులు చెల్లించమని ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంపై శనివారం పలాస టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీష విలేకరుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి డా.అప్పలరాజు చెప్పుడు మాటలు విని తప్పుడు రాతలు రాసి తన పరువుకు భంగం కలిగించిన విలేకరిపై చట్టపరంగా పోరాటం చేశానని తెలిపారు.

ముద్దాడపేట రామమందిరంలో విగ్రహాల ప్రతిష్ఠ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడపేటలోని శ్రీరామ మందిరంలో శ్రీరామ, సీత, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్టోత్సవం శనివారం జరిగింది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం, యాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తులసి మొక్కను నాటి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సం ఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి మండలంలో పలు సమస్యలపై ఆర్డీవో పర్యటన

విశాలాంధ్ర సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలంలో గల వివిధ రకాల సమస్యలపై టెక్కలి ఆర్డిఓ ఎం కృష్ణమూర్తి శనివారం పర్యటించారు. ముందుగా మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు యాజమాన్యం కాకరపల్లి సంపర పై నిర్మిస్తున్న తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. కాకరపల్లి తంపరపై వంతెన నిర్మించడం వల్ల సుమారు 6, ఎకరాల పంట పొలాలు ముంపునకు గురవుతాయని మార్చి 21న కాకరపల్లి సర్పంచ్ పల్లి జోగారావు, సంతబొమ్మాళి రైతు సంఘం నాయకుడు కోత మధుసూదన్ రావు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. దీంతో మంత్రి అచ్చం నాయుడు ఆర్డీవోకు ఆదేశించడంతో వంతెనను పరిశీలించారు. అనంతరం నౌపడలో నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ పనులను పరిశీలించారు. ఈ కాలనీలో తాత్కాలికంగా సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం మేఘవరం హుదూద్ తుఫాన్ ఇండ్లలో సంబంధిత కుటుంబాలు నివసిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆర్డిఓ తో పాటు సంతబొమ్మాళి మండలం తాసిల్దార్ ఆర్. అప్పలరాజు, వీఆర్వో సాయి అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండే పొందూరు పైడితల్లి జాతర

విశాలాంధ్ర-పొందూరు: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, పిలిస్తే పలికే తల్లి,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పొందూరు పైడితల్లి అమ్మవారి యాత్ర మహోత్సవాలు ప్రతి ఏటా వైభవంగా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది కూడా రంగరంగ వైభవంగా నేటి ఆదివారము నుండి అమ్మ తల్లికి ప్రీతికరమైన మంగళవారం వరకు ఈ జాతర వేడుకగా జరుపుకోవాలని ఇక్కడ ఓ సంస్కృతి సాంప్రదాయంగా నిలిచింది.పైడితల్లి అమ్మవారు మహిమలు కోకొల్లలు. ఆమె జన్మ వృత్తాంతం పై అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. పైడితల్లి అమ్మవారు ఆ పూర్వ శక్తులు గల గొప్ప దేవత, భక్తులు కోరిన వెంటనే వరాలు ఇచ్చే కల్పవల్లిగా, విద్య విజ్ఞానాలకు ప్రసాదించే అపర సరస్వతిగా వేయి వేల రూపాలలో కనివిస్తుంది. ఆ తల్లి మహిమలు చెప్పేందుకుఆ తల్లి చరిత్ర విశేషమే,పురాణాలకు మించినవురాణమే,నిత్య భక్తితో జరవవలసిన పారాయణం. పైడితల్లి ఆవిర్భావం పై ఎన్నో రకాల కథనాలు ఉన్నప్పటికీ తలచుకుంటేనే ఒళ్ళు పులకరించే ఈ గాథ పైడితల్లి అవిర్భవానికి సాక్ష్యం. పైడితల్లి అమ్మవారు 12వ శతాబ్దంలో శాలివాహన చక్రవర్తుల కాలంలో చిప్పాడ వంశీయులు సంచారకులతో కలసి వచ్చిన ఒక శివలింగం ఆకారంలో రూపాంతరం చెంది ప్రతిమ లభ్యం కావడం ఒక అపూర్వ గట్టాం . ఆధ్యాత్మికతకు పట్టం. ఉత్తరాంధ్రాకు చల్లని వరం అ%శీ%ది%శీ%చిన పొందూరు పైడితల్లి జాతరకు నాంది ప్రస్తావం.నేటికీ అమ్మవారి మునిడిక వనంలో సైతం పెద్ద ఎత్తున భక్తులచే జైజైలు అందుకుంటూ దేదివ్యమానంగా వెలుగుతుంది ఈ ప్రాంత ప్రజలకు చల్లగా లాలిస్తూ లోకాలను పాలించే లోకమాతగా జై జైలు అందుకుని కోరిన వరాలను అనుగ్రహించె కొలువైన తల్లిగా పూజలు అందుకుంటుంది.రైతులకు పంట సిరులు, వ్యాపారులకు కాసుల పంట,పిల్లలకు విద్యాబుద్ధులు,మహిళలకు శాంతి సౌభాగ్యాలు ఎవరు ఏది కోరితే అది అడిగిందే తడవుగా ఇచ్చే చల్లని తల్లి పొందూరు పైడితల్లి, ఆ తల్లిని కోలిస్తే కష్టాలే ఉండవని, బాధలు దరిచేరవని ఇక్కడి ప్రజలు నమ్మకం. నిరంతరం ఆలయ అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్న పైడితల్లి అమ్మవారి ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అనకాపల్లి శివకుమార్ కృషి ఫలితంగా ఎంతో వైభవంగా 40వ యాత్ర మహోత్సవాలు నేటి ఆదివారం నుండి అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం వరకు అంగరంగ వైభవంగా ఉప్పొంగిన జన సద్రం మధ్య వేలాది భక్తులు మొక్కులు తీర్చు కుంటారు. ఈ ఉత్సవాలు సందర్భంగా మొదటి రోజైన ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవ విగ్రహం పురవీధుల్లో కలసకాలతో ఊరేగింపు నిర్వహిస్తు న్నారు. రాత్రి పది గంటలకు సీతా రామా కళ్యాణం అను బుర్ర కదురమ్యంగా ప్రదర్శింపబడుతుంది. సోమవారం సాయంత్రం రాత్రి 9 గంటల 30 నిమిషాలకు బాలు రైడర్స్ విశాఖ వారిచే ఢీ షో డాన్స్ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుంది. అమ్మవారికి ప్రీతికరమైనమంగళవారం నాడు భక్తులకు భారీ అన్నదానం నిర్వహిస్తున్నారు.రాత్రి 10 గంటలకు శ్రీ భవాని కళానికేతన్ శ్రీ పైడితల్లి నాట్యమండలి వారిచే రాష్ట్రస్థాయి కళాకారులచే శ్రీ రత్నములు చింతామణి ప్రణయ సన్నివేశం, గయోపాఖ్యానం (యుద్ధ సీను) సత్య హరిచంద్ర(అరణ్య సీను) ప్రదర్శిస్తున్నట్లుఆలయ కమిటీ వెల్లడించింది. ఈ జాతర ఉత్సవాలకు భక్తులు లక్షలాదిగా పాల్గొని అమ్మ తల్లి తీర్థ ప్రసాదాలను స్వీకరించి పైడితల్లి కృపకు పాత్రులు అవుతారని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు అధికారాలు ఇవ్వని సమావేశాలు ఎందుకు ?

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన వైకాపా సభ్యులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు అధికారాలు ఇవ్వని సమావేశాలు ఎందుకని కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుండి స్థానిక సంస్థల్కైన పంచాయతీ అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేయకుండా, అభివృద్ధికి సహకరించని మండల పంచాయతీరాజ్ అధికారులు, ఇతర అధికారుల తీరుకు నిరసనగా, ఎంపీటీసీల గౌరవ వేతనం చెల్లించని కారణంగా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తూ ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. ఈ తీర్మాన కాపీని స్థానిక ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్‌కు మండల విఫ్ బొడ్డు అప్పన్న, జడ్పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామక్రిష్ణ తదితరులు అందజేశారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను కూటమి ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని దుయ్యబసమాధానంట్టారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిరదని దీనికి ఎవరు చెప్తారని ప్రశ్నిస్తూ బయటకి వెళ్ళిపోయారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీస్ రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-సోంపేట: మండలం బారువ మెరైన్ పోలీసులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ సీఐడి జె.రమేష్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరానికి తీర ప్రాంత గ్రామాల నుంచి 65 మంది దాతలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. వీరి నుంచి 64.5 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల నుంచి మత్స్యకార యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం గొప్ప విషయమని అధికారులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, కాశీబుగ్గ ప్రాణదాత ఫౌండేషన్ సిబ్బంది, హరిపురం, సోంపేట సీహెచ్‌సిల సిబ్బంది, ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు

చీటి లేనిదే మందులు దొరకవు

విశాలాంధ్ర-సోంపేట: ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వైద్యులు రాసిచ్చిన చీటి లేనిదే దుకాణాల్లో మందులు ఇవ్వడం జరగదని సోంపేట మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్జ కృష్ణారావు, కార్యదర్శి కొత్తకోట సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోంపేట పట్టణంలో ప్రతి మెడికల్ షాపు వద్ద నో ప్రిష్క్రిప్షన్ నో మెడిసన్ స్టిక్కర్లను శనివారం అతికించారు. వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకరరావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మెడికల్ ఆసోసియేషన్ నిర్ణయం పట్ల అనేక మంది పెదవి విరుస్తున్నారు. చిన్న చిన్న అవసరాల కోసం డాక్టర్ చీటి అంటే ఎలా సాధ్యమని అత్యవసర పరిస్థితుల్లో చీటి లేకుండా మందులు ఎక్కడ లభ్యమవుతాయని పేర్కొన్నారు. చిన్న విషయానికి కూడా డాక్టర్ వద్దకు వెళ్లాలంటే వందల్లో ఫీజులు చెల్లించుకోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకి సహకరించండి

- మంత్రి అచ్చెన్నను కోరిన దళిత జెఏసి నేతలు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణులు
- కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ

విశాలాంధ్ర-టెక్కలి/కోటబొమ్మాళి: శ్రీకాకుళం నగరం అంబేద్కర్ జంక్షన్ లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహ ఏర్పాటుకి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ను దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణులు కోరారు. ఈ మేరకు వారు రాష్ట్ర మంత్రిని కోటబొమ్మాలి లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం కలుసుకున్నారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు అక్కడ జంక్షన్ ను అభివృద్ధి చేసేలా చర్యలుచేపట్టాలని వారు వినతిపత్రం అందజేసారు. దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను,డా.కంఠ వేణులు వినతిపై తక్షణం స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ తో మాట్లాడుతానని... రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దయ వల్ల అంతా ఉన్నత స్థానాలలో ఉన్నామని అటువంటి మహానుభావుని కాంస్య విగ్రహం నగరంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ జంక్షన్ను అభివృద్ధి చేసి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి దాని చుట్టూప్రక్కల అందంగా ఉండేలాగా, ఆ జంక్షన్ లో రోల్ మోడల్ గా ఉండేలా నిర్మాణ పనులను చేపడతానని ఆ బాధ్యత నాదేనని ఆయన అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న జరుగనున్న దృష్ట్యా ఆ లోపు పనులు పూర్తి చేసేలా కలెక్టర్ తో మాట్లాడి... పనులు చేపడతానని తెలిపారు. అంబేద్కర్ కాంచ విగ్రహం ఏర్పాటులో మంత్రి అచ్చెన్నాయుడు భాగస్వామ్యమై.. హామీ ఇచ్చినందుకు దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను,డా. కంఠవేణులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో పెయ్యల చంటి లు ఉన్నారు.

మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పట్టణంలో చేపడుతున్న మంచినీటి సరఫరా విషయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణం నడిబొడ్డున పెద్దకోమటివీధి శివారున కన్యాకపరమేశ్వరి ఆలయం ఎదురుగా 15 రోజుల క్రితం పైపులైన్ లీకేజీకి గురైంది. అప్పటి నుంచి నీటి సరఫరా చేసే ఉదయం వేళ సుమారు గంట సమయం పాటు నీరు విపరీతంగా లీకయి రోడ్లపై వృధాగా పారుతోంది. దీన్ని అరికట్టేందుకు నీటి సరఫరా చేస్తున్న సిబ్బంది గాని, అధికారులు గాని కనీసం పట్టించుకోకపోవడంతో ఇబ్బందికరంగా ఉంది. ఇంటింటికి కొళాయిలు నిర్మించే సందర్భంలో ఇక్కడ త్రవ్వకాలు జరిపి చేపట్టిన పైపులైన్ సర్దుబాటుల్లో నిర్లక్ష్యం కారణంగా తొందరలోనే లీకేజీ ఏర్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు కూడా ఏ మాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పలువురు వాపోతున్నారు.

ఏఐపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)పై అవగాహన పెంపొందించుకోవాలని హెచ్ఎంఐ ఇంజనీరింగ్ సర్వీసెస్ (విశాఖపట్నం) సీఈవో దినేష్కుమార్ హిరావత్ అన్నారు. శ్రీ శివానీ ఇంజ నీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో విద్యార్థులకు ఎక్స్ప్లెనబుల్ అండ్ జనరేటివ్ ఏఐ అనే అంశంపై వారం రోజులుగా నిర్వహిసు న్న వర్క్షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టూల్స్పై అవగాహన కల్పించుకుని ఇతర విభాగాలకు అన్వయించాలన్నారు. తదనంతరం హేకతాన్ ఈవెంట్‌ను నిర్వహించారు. వర్క్షాపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్, సీఎస్ఈ విభాగాధిపతి జగదీష్‌కుమార్, పీడీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడి శిక్షణా కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం లో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. శిక్షణలో వివరించిన అంశాలను తప్ప కుండా పాటించాలని పీవో అనురాధ తెలిపారు. అంగన్వాడి కేంద్రాల బలోపేతం కోసం ఇలాంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నా రు. పోషణ భి పడాయి భి లో భాగంగా మూడు రోజుల శిక్షణ నిర్వహించినట్లు తెలియజేశారు. పిల్లల్లో సమగ్రభివృద్ధి, 1000రోజుల సంరక్షణ, ఆదర్శిలా, నవచేతన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలియజేశారు. ఈ శిక్షణలో వివరిం చిన అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో పాటించి కేంద్రాల పురోగతిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కేంద్రాలను సమయపాలన పాటి స్తూ, పౌష్టికాహారాన్ని విధిగా అందజేయాలన్నారు. పిల్లల శారీరక మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలా సంపూర్ణాహారం అందించాలని దానిపై ప్రతి కార్యకర్త అవగాహన కలిగి ఉండాల న్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగ న్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదరణ - 3 సద్వినియోగం చేసుకోవాలి

బీసీ కార్పొరేషన్ ఈ డి పెటోజిరావు



విశాలాంధ్ర-రణస్థలం: విజయనగరం జిల్లా కేంద్రంలో బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టినున్న ఆదరణ త్రీ పథకంపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి వివిధ రకాల కులవృత్తిదారులకు ఆదరణ త్రీ పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఈ పథకాన్ని వివిధ కుల వృత్తిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఆదరణ త్రీ పథకం ద్వారా అధునాతన, టెక్నాలజీ తో కూడిన పరికరాలను అందించి ఆయా వృత్తిదారులకు ఆర్థిక అభివృద్ధి చెందడానికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఏ ఏ పరికరాలు ఎక్కువగా ఉపయోగపడతాయో ఆ పరికరాలను గుర్తించాలని ఆయా కుల సంఘ నాయకులకు కోరారు. అలాగే రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో వృత్తిదా రులు సరైన ఆదరణ లేక జీవనోపాధికి దొరకక నానా అవస్థలు పడ్డారని ఆయన ఆరోపించారు. కుటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందని ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి రెండు రెండు విధాలుగా దూసుకుపోతుందని తెలిపారు. వివిధ రకాల కులవృత్తిదారులంతా ఆదరణ త్రీ పథకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్రముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్దేశం అన్నారు. అనంతరం వివిధ సలహాలను సూచనలను వినతిపత్రంలో రాసి అందజేశారు. ఈ కార్యక్రమం లో పలువురు డైరెక్టర్స్ విజయ్ కుమార్ తో పాటు మరికొంత మంది జిల్లాలో ఉన్న వివిధ కుల సంఘాల నాయకులు రజక నాయి బ్రాహ్మణ, కమ్మర, కుమ్మర, వడ్రంగి, మేదర, విశ్వబ్రాహ్మణ, మత్స్యకార తదితర కుల సంఘాల నాయకులు సోపేటి రామారావు, చల్ల సాయి శంకర్, గోవింద, చిట్టితల్లి, సత్యం, అచ్చన్న, రమణ, నాగరాజు, అప్పలస్వామి పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష వాయిదా

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్ష వాయిదా పడినట్టు ఎచ్చెర్ల, దుప్పలవలస గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ బి.లక్ష్మి, బి.ఐచ్చిరాజు శనివారం తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ పరీక్ష అనివార్య కారణాల వల్ల ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడిందన్నారు. ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందన్నారు. ఈ మార్పును విద్యార్థులు గమనించాలని కోరారు.